సాక్షి ఖమ్మం

శుక్రవారం । 9 । ఫిబ్రవరి । 2024



తనిఖీలు త్వరగా పూర్తిచేయండి

మహాలక్ష్మి పథకం దరఖాస్తుల క్షేత్రస్థాయి తనిఖీని త్వరగా పూర్తిచేయాలని కలెక్టర్ గౌతమ్ ఆదేశించారు.

8లో



సామాన్యుల సమస్యలే అజెండా

సామాన్యుల సమస్యలే పార్టీల అజెండా అయితేనే అందరికీ మంచి జరుగుతుందని ప్రొఫెసర్ నాగేశ్వర్ వెల్లడించారు.

8లో

గరిష్టం / కనిష్టం
34° / 22°

వాతావరణం

శుక్రవారం జిల్లాలో ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. ఉదయం నుంచే ఎండ మొదలై మధ్యాహ్నానికి గరిష్టస్థాయికి చేరుతుంది.

న్యూస్‌రీల్

రవాణా శాఖలో నేడో, రేపో బదిలీలు

ఖమ్మంక్రైం: ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని రవాణా శాఖలో భారీగా బదిలీలు జరగనున్నట్లు తెలిసింది. ఈమేరకు నేడో, రేపో ఉత్తర్వులు జారీ అవుతాయని సమాచారం. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో ఆర్‌టీఓలు మొదలు ఎంవీఐలు, ఏఎంవీఐల బదిలీ జరగనుందని తెలుస్తోంది. గ్రూప్–1 ద్వారా నియమితులై ఆర్‌టీఓలుగా పదోన్నతి పొందిన ఆర్‌టీఓలు, ఎంవీఐలు ఈ జిల్లాల్లో పోస్టుల కోసం పోటీ పడుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే ఆదాయం ఎక్కువగా ఉండే చెక్‌పోస్టులు దక్కించుకునేందుకు అధికార పార్టీ నాయకులను ఉద్యోగులు ఆశ్రయించినట్లు సమాచారం.

ఈ–కేవైసీ పూర్తి చేయండి

ఖమ్మం సహకారనగర్: రేషన్‌కార్డు లబ్ధిదారులు ఈనెలాఖరులోగా ఈ–కేవైసీ చేయించుకునేలా అవగాహన కల్పించాలని అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్ సూచించారు. కలెక్టరేట్‌లో గురువారం అధికారులతో సమావేశమైన ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు 70 శాతం ఈ–కేవైసీ పూర్తయిందని తెలిపారు. మిగతా వారందరూ కూడా ముందుకొచ్చేలా అధికారులు దృష్టి సారించాలని, ఈ విషయంలో డీలర్లకు సూచనలు చేయాలని పేర్కొన్నారు. సమీక్షలో జిల్లా పౌరసరఫరాల అధికారి చందన్ కుమార్, జిల్లా పౌరసరఫరాల మేనేజర్ శ్రీలత, డీటీలు సురేందర్, సత్యనారాయణ, రాంచందర్, విజయ్‌బాబు, నిస్సార్ పాల్గొన్నారు.

'గృహజ్యోతి'కి సమాచారం ఇవ్వాలి

ఖమ్మంవ్యవసాయం: గృహజ్యోతి పథకానికి దరఖాస్తు చేసుకున్న అర్హులైన వినియోగదారులు నిర్దేశిత సమాచారాన్ని విద్యుత్ ఉద్యోగులకు అందించాలని ఖమ్మం ఎస్ఈ ఏ.సురేందర్ సూచించారు. ప్రజాపాలన దరఖాస్తుకు జత చేసిన రేషన్‌కార్డు, ఆధార్ కార్డు నంబర్‌తో పాటు ప్రజాపాలన సభలో అధికారులు ఇచ్చిన రశీదు సిద్ధం ఉంచుకుని ఇళ్లకు వచ్చే విద్యుత్ సిబ్బంది అందచేయాలని తెలిపారు. కాగా, సిబ్బంది ఇంటికి వచ్చిన సమయాన లబ్ధిదారులు లేని పక్షాన సమీపంలోని విద్యుత్ కార్యాలయంలో అందజేసి ధృవీకరించుకోవాలని ఎస్ఈ ఓ ప్రకటనలో సూచించారు.

సాగర్ నీటి నిలిపివేత

నాగార్జునసాగర్: నాగార్జునసాగర్ ఎడమ కాల్వకు నీటి విడుదలను గురువారం నిలిపివేశారు. ఖమ్మం జిల్లాలో తాగునీటి అవసరాల కోసం పాలేరు జలాశయాన్ని నింపేందుకు గాను గత నెల 31వ తేదీ నుంచి నీరు విడుదల చేస్తున్నారు. ఇప్పటివరకు 34,809 క్యూసెక్కుల నీటిని విడుదల చేయగా, గురువారం నుంచి నిలిపివేశారు.

కానిస్టేబుళ్ల శిక్షణకు రెడీ...



శిక్షణ కేంద్రంలో పరిశీలిస్తున్న సీపీ సునీల్‌దత్

ఖమ్మంక్రైం: స్టైపండరీ కేడెట్ ట్రైనీ పోలీసు కానిస్టేబుళ్ల శిక్షణ కోసం ఖమ్మంలోని శిక్షణ కేంద్రంలో అన్ని ఏర్పాట్లు చేసినట్లు పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ తెలిపారు. తెలంగాణ పోలీస్ నియామక మండలి ద్వారా ఎంపికైన కానిస్టేబుళ్లలో 250మందిని శిక్షణ కోసం ఖమ్మంకు కేటాయించారని పేర్కొన్నారు. ఈమేరకు సిటీ శిక్షణ కేంద్రాన్ని గురువారం ఆయన పరిశీలించి మాట్లాడారు. కానిస్టేబుళ్లకు శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు పూర్తిచేయగా, కంప్యూటర్ లాబ్, గ్రంథాలయం, బ్యారెక్స్, భోజనశాల ఇతర వసతులను పరిశీలించి ఉద్యోగులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ ఏసీపీ నర్సయ్య, ఉద్యోగులు రామదాసు, రాంచందర్, కామరాజు, తిరుపతి పాల్గొన్నారు.

డిప్యూటేషన్ల రద్దుతో ఉద్యోగుల రిలీవ్

ఖమ్మం వైద్యవిభాగం: వైద్య ఆరోగ్య శాఖ, వైద్య విధాన పరిషత్, మెడికల్ ఎడ్యుకేషన్‌లో డిప్యూటేషన్లను రద్దు చేయడంతో సంబంధిత ఉద్యోగులను అధికారులు రిలీవ్ చేశారు. జిల్లాలోని పీహెచ్‌సీలు, ఏరియా ఆస్పత్రులు, డీఎంహెచ్‌ఓ, డీసీహెచ్‌ఎస్ కార్యాలయాలు, ఖమ్మం జనరల్ ఆస్పత్రి, ప్రభుత్వ మెడికల్ కళాశాలలో డిప్యూటేషన్‌పై పనిచేస్తున్న వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, ఇతర ఉద్యోగులను ఉన్నతాధికారులు గుర్తించారు. ఈమేరకు వైద్య, ఆరోగ్య శాఖలో 45 మంది, వైద్య విధాన పరిషత్‌లో 31 మంది డిప్యూటేషన్‌పై విధులు నిర్వర్తిస్తున్నట్లు తేలగా రిలీవ్ చేశారు. ఇక ఇతర జిల్లాల్లో విధులు నిర్వర్తిస్తున్న వారిని సైతం రిలీవ్ చేయగా ఎనిమిది మంది వైద్య, ఆరోగ్య శాఖ ఉద్యోగులు, నలుగురు వైద్య విధాన పరిషత్ వైద్యులు జిల్లాలో రిపోర్ట్ చేశారు. అలాగే, ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఇద్దరు వైద్యులు, ముగ్గురు సిబ్బంది రిలీవ్ కాగా, ఇతర జిల్లా నుంచి వచ్చిన ఇద్దరు వైద్యులు, నలుగురు నర్సింగ్ సిబ్బంది ఇక్కడ రిపోర్టు చేశారు.



ఆ స్థానం పదిలమేనా?!

వచ్చే ఏప్రిల్‌లో రాష్ట్రంలో మూడు రాజ్యసభ స్థానాలు ఖాళీ కానున్నాయి. ఈ ముగ్గురూ బీఆర్‌ఎస్ నేతలే కాగా, వీరిలో జిల్లాకు చెందిన వద్దిరాజు రవిచంద్రతో పాటు జోగినపల్లి సంతోష్‌కుమార్, బడుగు లింగయ్యయాదవ్ ఉన్నారు. ఆయా స్థానాలకు ఎన్నికలు నిర్వహించేందుకు నామినేషన్ల స్వీకరణ మొదలుకాగా.. ప్రస్తుత ఎమ్మెల్యేల సంఖ్యాబలాన్ని పరిశీలిస్తే కాంగ్రెస్‌కు రెండు, బీఆర్‌ఎస్‌కు ఒక స్థానం దక్కనున్నాయి. అయితే, గతంలోనే కేసీఆర్ మరోమారు వద్దిరాజుకు అవకాశమిస్తామని హామీ ఇచ్చినందున ఆయనకే పదవి దక్కుతుందని అనుచరుల్లో ప్రచారం జరుగుతోంది. బీసీ కోటాలోనూ రవిచంద్రకే అవకాశం వస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

– సాక్షిప్రతినిధి, ఖమ్మం

ఏప్రిల్ 2తో పూర్తికానున్న ఎంపీ రవిచంద్ర పదవీ కాలం

- కేసీఆర్ హామీతో మళ్లీ వద్దిరాజుకే అవకాశమని అనుచరుల్లో చర్చ
- రాష్ట్రంలో ఖాళీ కానున్న మూడు రాజ్యసభ స్థానాలు
- ఎమ్మెల్యేల సంఖ్యాబలంతో కాంగ్రెస్‌కు రెండు, బీఆర్‌ఎస్‌కు ఒకటి..

ఇరవై నెలలు పదవిలో...

బీఆర్‌ఎస్ నుంచి రాజ్యసభ సభ్యుడిగా ఉన్న బండా ప్రకాష్ ఎమ్మెల్సీగా ఎన్నిక కావడంతో ఆ స్థానంలో వద్దిరాజు రవిచంద్రను కేసీఆర్ రంగంలోకి దింపారు. బీఆర్‌ఎస్‌కు అప్పుడు ఉన్న సంఖ్యాబలంతో ఆయన మే 2022లో రాజ్యసభకు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ ఇరవై నెలల కాలంలో ఆయన ఉమ్మడి ఖమ్మం జిల్లావ్యాప్తంగా బీఆర్‌ఎస్ పార్టీ పరంగా తనదైన ముద్ర వేయడమే కాక మున్నూరు కాపు సామాజిక వర్గం ముఖ్యనేతగా బీఆర్‌ఎస్‌లోకి ఆ సామాజిక వర్గ నేతలను చేర్పించడంలో కీలక పాత్ర పోషించారు. అసెంబ్లీ ఎన్నికల సమయాన ఇల్లెందు, కొత్తగూడెం నియోజకవర్గ బాధ్యతలను కేసీఆర్ ఆయనకు అప్పగించారు. ఇక పార్లమెంట్‌లో ఉమ్మడి జిల్లా, రాష్ట్రానికి సంబంధించిన పలు సమస్యలే కాక విభజన సమస్యలపైనా తన గళం వినిపించారు.

హామీ నెరవేర్చాలని..

బీఆర్‌ఎస్ నుంచి వద్దిరాజు రవిచంద్రతోపాటు మరో ఇద్దరి పదవీకాలం పూర్తి కానుండగా.. ఈసారి ఎమ్మెల్యేల సంఖ్యాబలాన్ని చూస్తే ఒక్క స్థానం దక్కనుంది. ఒక్కో రాజ్యసభ స్థానానికి 31 మంది ఎమ్మెల్యేల మద్దతు అవసరం కాగా.. బీఆర్‌ఎస్‌కు 39 మంది ఎమ్మెల్యేలు ఉండడంతో ఆ పార్టీకి ఒక స్థానం దక్కడం ఖాయమనే చెప్పాలి. కాగా, రాజ్యసభ సభ్యుడిగా రెండోసారి వద్దిరాజుకు అవకాశం దక్కుతుందని కేసీఆర్ గతంలో పలు వేదికలు, సమావేశాల్లో ప్రస్తావించడంతో ఈ హామీ నెరవేర్చాలని ఆయన అనుచరుల నుంచి విన్నపాలు వస్తున్నాయి. కాగా, పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఏప్రిల్‌లో పదవీకాలం ముగియనున్న రాజ్యసభ సభ్యులకు వీడ్కోలు ఏర్పాటుచేయగా.. వద్దిరాజు మాట్లాడుతూ తమ పార్టీ అధినేత కేసీఆర్ మళ్లీ ఆశీర్వదిస్తే ఇదే సభలో అడుగు పెడతానన్న ఆశాభావం వ్యక్తం చేశారు. రాజ్యసభ సభ్యుడిగా తన పదవీకాలంలో చరిత్రలో నిలిచిపోయే ఘటనల్లో భాగస్వామిని కావడానికి అవకాశమిచ్చిన కేసీఆర్‌కు రుణపడి ఉంటానని తెలిపారు.

అభ్యర్థుల ప్రకటనకు కసరత్తు

రాజ్యసభకు ఖాళీ అయిన స్థానాలకు ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేయగా.. నామినేషన్ల స్వీకరణ మొదలైంది. ఈనెల 27వ తేదీన పోలింగ్ నిర్వహిస్తారు. నామినేషన్ల స్వీకరణ గడువు 15వరకు ఉండగా, కాంగ్రెస్, బీఆర్‌ఎస్ అభ్యర్థులను ప్రకటించేందుకు కసరత్తు చేస్తున్నాయి. అసెంబ్లీ బలాబలాలను పరిశీలిస్తే కాంగ్రెస్‌కు రెండు, బీఆర్‌ఎస్‌కు ఒక స్థానం దక్కనుండడంతో రాజ్యసభలో పార్టీ వాణిని బలంగా వినిపించే అభ్యర్థుల కోసం అన్వేషిస్తున్నాయి. కాంగ్రెస్ అభ్యర్థుల పేర్లపై చర్చ జరుగుతుండగా.. బీఆర్‌ఎస్ తరఫున మాత్రం వద్దిరాజుకే ఖాయమని ప్రచారం ఉంది. రెండు, మూడు రోజుల్లోనే రెండు పార్టీలు కూడా అభ్యర్థులను ప్రకటించే అవకాశముందని సమాచారం.

మట్టిని మింగిన ఘనులు



ఆలయ భూమిలో మట్టి తవ్విన ఆనవాళ్లు

జీళ్లచెరువు ఆలయ భూముల్లో దందా

- దేవాదాయ శాఖకు రూ.4 లక్షల రాయల్టీ ఎగనామం
- డీసీసీబీ డైరెక్టర్ ఇంటూరి శేఖర్‌తో పాటు ముగ్గురి అరెస్ట్
- 14 రోజుల రిమాండ్ విధించిన న్యాయమూర్తి



పరీక్షల కోసం ప్రభుత్వ ఆస్పత్రికి ఇంటూరి శేఖర్ (ఎడమ)ను తీసుకొచ్చిన పోలీసులు

కూసుమంచి: అక్రమార్కుల ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. గత ప్రభుత్వంలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని, అధికారులను బెదిరించిన ఓ ప్రజాప్రతినిధి ఆలయ భూముల్లో మట్టి అక్రమంగా తరలించి రూ.లక్షల్లో ప్రభుత్వ సొమ్ము కొల్లగొట్టారు. ఈ ఉందంతం కూసుమంచి మండలం జీళ్లచెరువులో వెలుగుచూడగా ఎట్టకేలకు అక్రమార్కులపై అధికారులు కొరడా ఝుళిపించారు. దేవాలయ భూముల నుంచి అక్రమంగా మట్టి తరలించడంలో కీలకపాత్ర పోషించిన డీసీసీబీ డైరెక్టర్ ఇంటూరి శేఖర్‌తో పాటు జీళ్లచెరువు శ్రీసీతారామచంద్రస్వామి ఆలయ చైర్మన్ చెన్నా వెంకన్న, డైరెక్టర్లు కొండా వెంకన్న, చింతలపాటి రామకృష్ణపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

హైవే పేరుతో తరలింపు

కూసుమంచి మండలం మీదుగా ఖమ్మం–సూర్యాపేట జాతీయ రహదారి నిర్మాణాన్ని 2020లో ప్రారంభించారు. ఈ నిర్మాణం జీళ్లచెరువు మీదుగా సాగుతుండడంతో సంబంధిత అధికారులు ఆయా గ్రామాల్లోని చెరువులు, ప్రభుత్వ భూముల నుంచి రాయల్టీ చెల్లించి మట్టి తరలించారు. ఈక్రమంలోనే జీళ్లచెరువులో శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయానికి 79 ఎకరాలు ఉండగా ఇందులో ఇంటూరి శేఖర్ ద్వారా పాలకమండలి సభ్యుల అనుమతితో హైవే అధికారులు మట్టి తరలించారు. ఇందుకు గాను వారు సుమారు రూ.4 లక్షల రాయల్టీ చెల్లించినట్లు చెబుతున్నా నగదు దేవాదాయ శాఖకు చేరలేదని అధికారులు తేల్చారు. అయితే, హైవేకు మట్టి తరలింపు పేరుతో శేఖర్ అండదండలతో గ్రామానికి చెందిన ఆలయ కమిటీ చైర్మన్, డైరెక్టర్లు వందలాది ట్రక్కుల మట్టిని ఆలయ భూమి నుంచి అక్రమంగా తరలించి అమ్ముకున్నట్లు ఆరోపణలున్నాయి.

మంత్రి ఆదేశాలతో కదిలిన యంత్రాంగం

అక్రమ మట్టి తవ్వకాలపై ఫిర్యాదు అందడంతో పాలేరు ఎమ్మెల్యే, రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సీరియస్ అయ్యారు. ప్రభుత్వ భూముల కబ్జా, ఆలయ భూముల్లో అక్రమంగా మట్టి తరలించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించటంతో రెవెన్యూ, దేవాదాయ, మైనింగ్, ఇరిగేషన్ అధికారులు రంగంలోకి దిగారు. ఈ సందర్భంగా జీళ్లచెరువులోని ఆలయ భూములను పరిశీలించగా అక్కడ మట్టి తవ్వకాలు జరిగిన తీరును చూసి నివ్వెరపోయారు. ఈ అంశంపై దేవాదాయ, మైనింగ్ శాఖలు సంయుక్తంగా సర్వే నిర్వహించి అక్రమ పద్ధతుల్లో భారీగా మట్టి తవ్వి తరలించినట్లు తేలింది.

ప్రశ్నిస్తే బెదిరింపులు, బదిలీలు

దేవాలయ భూమి నుంచి అక్రమంగా మట్టిని తరలిస్తున్న సమయాన అధికారులు అడ్డుకునేందుకు యత్నించారు. అయితే, అప్పుడు అధికార పార్టీ ప్రజాప్రతినిధిగా ఉన్న ఇంటూరి శేఖర్ తనను బెదిరించడమే కాక అన్యాయంగా బదిలీ చేయించారని ఆలయ అధికారి.. విచారణ అధికారుల వద్ద వాపోయారు. అధికార పార్టీ అండదండలతోనే షాడో ఎమ్మెల్యేగా కొనసాగిన ఇంటూరి శేఖర్ పలు అక్రమాలు, దౌర్జన్యాలకు పాల్పడడంతో పాటు అధికారులపై పెత్తనం చెలాయించాడనే ఆరోపణలు ఉన్నాయి.

అరెస్ట్, రిమాండ్

మట్టి అక్రమ తవ్వకాల్లో కీలక పాత్ర పోషించిన డీసీసీబీ డైరెక్టర్ ఇంటూరి శేఖర్‌ను దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సులోచన ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం అర్ధరాత్రి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈకేసులో ఏ1గా శేఖర్ పేరు చేర్చగా ఆయనతో పాటు ఆలయ చైర్మన్ చెన్నా వెంకన్న, డైరెక్టర్లు కొండా వెంకన్న, చింతలపాటి రామకృష్ణను సైతం అరెస్ట్ చేశారు. ఈమేరకు గురువారం ఖమ్మం ప్రభుత్వ ప్రధానాస్పత్రిలో పరీక్షల అనంతరం ఖమ్మం ప్రత్యేక సంచార న్యాయస్థానం న్యాయమూర్తి రజిని ఎదుట హాజరు పరిచారు. దీంతో న్యాయమూర్తి వీరికి 14 రోజుల రిమాండ్ విధించగా నిందితులను జిల్లా జైలుకు తరలించారు. కాగా, శేఖర్‌కు బెయిల్ కోసం న్యాయవాదులు పిటీషన్ దాఖలు చేయగా.. ప్రభుత్వ న్యాయవాది కౌంటర్ దాఖలుకు సమయం కోరడంతో పిటీషన్‌ను శుక్రవారానికి వాయిదా వేశారు.

3.6లక్షల మెట్రిక్ టన్నుల మట్టి మాయం

జీళ్లచెరువులోని శ్రీసీతారామచంద్ర స్వామి ఆలయానికి సర్వే నంబర్ 332, 333, 334, 337, 338తో పాటు 306, 305 నంబర్లలో 79 ఎకరాల డిమాన్యం ఉంది. ఇందులో 18.25 ఎకరాల్లో అక్రమార్కులు మట్టి తవ్వకాలు చేపట్టారు. ఈ భూమిలో 3.6లక్షల మెట్రిక్ టన్నుల మట్టిని అక్రమంగా తరలించినట్లు అధికారులు తేల్చారు. దీని విలువ రూ.61లక్షలు అని చెబుతున్నా బహిరంగ మార్కెట్‌లో రెండితలు అధికంగానే ఉంటుందని సమాచారం.

అక్రమాలను సహించేది లేదు..

ఆలయ భూముల్లో అక్రమంగా తవ్వకాలు, ఆక్రమణలను సహించేది లేదు. జీళ్లచెరువు ఆలయ భూముల్లో జరిగిన అక్రమ తవ్వకాలపై సిబ్బంది సకాలంలో స్పందిస్తే బాగుండేది. మట్టి తవ్వి, తరలించినందుకు గాను హైవే అధికారులు రాయల్టీ చెల్లించినట్లు మాకు సమాచారం లేదు. ఈ అంశంపై పూర్తి స్థాయిలో విచారణ చేపడుతున్నాం.

– సులోచన, అసిస్టెంట్ కమిషనర్, దేవాదాయ శాఖ

మోటమర్రి–విష్ణుపురం మధ్య డబ్లింగ్

- రైల్వేలైన్‌కు కేంద్ర కేబినెట్ ఆమోదం
- మోటమర్రి వద్ద రైల్ ఓవర్ రైల్ బ్రిడ్జి కూడా...
- ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.1,746.20 కోట్లు

ఖమ్మం మామిళ్లగూడెం: జిల్లాలోని మోటమర్రి – ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని విష్ణుపురం మధ్య 88.81 కి.మీ.ల మేర రైల్వే డబ్లింగ్ లైన్ నిర్మాణానికి కేంద్ర కేబినెట్ గురువారం ఆమోదం తెలిపింది. అలాగే, మోటమర్రి వద్ద 10.87 కి.మీ.ల మేర రైల్ ఓవర్ రైల్ ప్రాజెక్టు నిర్మాణానికి సైతం పచ్చజెండా ఊపగా... ఈ రెండు ప్రాజెక్టుల నిర్మాణానికి రూ.1,746.20 కోట్ల నిధులు వెచ్చించనున్నారు.

సరుకు రవాణాలో వేగం..

కాజీపేట–విజయవాడ మార్గంలో మోటమర్రి స్టేషన్ ఉండగా.. ఇక్కడి నుంచి ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని సిమెంట్, ఇతర పరిశ్రమలకు సామగ్రి చేరవేసేందుకు విష్ణుపురం వరకు రైల్వేలైన్ నిర్మించారు. అయితే, సింగిల్ లైన్ కావడంతో నానాటికీ పెరుగుతున్న గూడ్స్ రైళ్ల రాకపోకలు ఆలస్యమవుతున్నాయి. దీంతో ఈ మార్గంలో డబుల్ లైన్ నిర్మాణానికి కేంద్రం ఆమోదించింది. తద్వారా రైళ్ల వేగం, సరుకు రవాణా సులువవుతుందని చెబుతున్నారు. అంతేకాక మోటమర్రి నుంచి విజయవాడ, గుంటూరుకు ప్రత్యామ్నాయ మార్గంగానూ ఉపయోగపడనుంది.



మోటమర్రి వద్ద నిర్మించే రైల్ ఓవర్ రైల్ నమూనా

రాష్ట్రాల నడుమ అనుసంధానం

మోటమర్రి – విష్ణుపురం మధ్య 88.81 కి.మీ.ల రైల్వే లైన్ డబ్లింగ్ చేయనుండగా.. మోటమర్రి వద్ద 10.87 కి.మీ.ల మేర రైల్ ఓవర్ రైల్ బ్రిడ్జి నిర్మిస్తారు. ఈ లైన్ తెలంగాణలోని ఖమ్మం, సూర్యాపేట, నల్లగొండ జిల్లాలతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్‌టీఆర్ జిల్లాల మీదుగా విస్తరించి ఉండగా... ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్రాలే కాక తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర తదితర రాష్ట్రాలతో అనుసంధానంగా కొనసాగుతోంది. ఈ మార్గాన్ని డబ్లింగ్ చేయడం ద్వారా రైళ్ల రాకపోకల్లో వేగం పెరుగుతుంది. ఈ లైన్ పూర్తయితే చిట్యాల, నార్కట్‌పల్లిలోని ఇనుము, ఉక్కు పరిశ్రమలు, విష్ణుపురం, మేళ్లచెరువు, జగ్గయ్యపేట, రామాపురం తదితర ప్రాంతాల్లో ఉన్న సిమెంట్ ప్లాంట్లు, విష్ణుపురం సమీపాన ఉన్న యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్, నాగిరెడ్డిపల్లి, నల్లగొండ, మిర్యాలగూడ సమీపంలోని ఎఫ్‌సీఐ గోదాంలకు సరుకు రవాణాలో వేగం పెరగనుంది. ఇక మోటమర్రి స్టేషన్ వద్ద రైల్ ఓవర్ రైల్ నిర్మాణంతో విష్ణుపురం, డోర్నకల్, భద్రాచలం రోడ్(కొత్తగూడెం), కాజీపేట స్టేషన్ల మధ్య రైళ్ల క్రాసింగ్‌లు తగ్గిపోయి నిరంతరాయంగా సరుకు రవాణాకు మార్గం ఏర్పడుతుంది.



మళ్లీ మహిళలదే హవా!

కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు కొత్త ఓటర్ల నమోదుతో పాటు మార్పులు, చేర్పుల అనంతరం ఓటర్ల లెక్క తేల్చారు. ఈమేరకు గురువారం తుది జాబితా విడుదల చేయగా జిల్లాలోని ఐదు నియోజకవర్గాల పరిధిలోని 12,19,243మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషులు 5,88,243 మంది, మహిళలు 6,30,913 మందితో పాటు ఇతరులు 87మంది ఓటర్లు ఉన్నారని వెల్లడించారు. కాగా, మొత్తం ఓటర్లతో పాటు నియోజకవర్గాల వారీగా చూసినా మహిళా ఓటర్ల సంఖ్యే ఎక్కువగా ఉండడం విశేషం.

– ఖమ్మం సహకారనగర్

జిల్లా ఓటర్లలో అతివలే అధికం

- మొత్తం ఓటర్లు 12,19,243మంది
- తుది జాబితా విడుదల చేసిన కలెక్టర్
- సత్తుపల్లిలో 120ఏళ్లు దాటిన వారు 110మంది..

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
ఖమ్మం	1,54,837	1,68,203	51	3,23,091
సత్తుపల్లి	1,18,006	1,24,668	12	2,42,686
పాలేరు	1,15,201	1,24,301	08	2,39,510
మధిర	1,06,787	1,14,573	10	2,21,370
వైరా	93,412	99,168	06	1,92,586
మొత్తం	5,88,243	6,30,913	87	12,19,243

పెరిగిన ఓటర్లు 2,411

జిల్లాలోని ఐదు నియోజకవర్గాల పరిధిలో ఓటర్ల సంఖ్యతో గతనెల 6వ తేదీన ముసాయిదా జాబితా విడుదల చేశారు. ఈ జాబితా ఆధారంగా జిల్లాలో 12,16,832మంది ఓటర్లు ఉన్నారు. అనంతరం ఆన్‌లైన్‌తో పాటు నేరుగా గత నెల 22వ తేదీ వరకు కొత్త ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పుల కోసం దరఖాస్తులు స్వీకరించారు. ఈక్రమంలోనే ఈనెల 20, 21వ తేదీల్లో స్పెషల్ సమ్మరీ రివిజన్(ఎస్ఎస్ఆర్) కూడా చేపట్టారు. ఈమేరకు కొత్త ఓటరుగా నమోదు కోసం 23,903 మంది, తొలగింపుల కోసం 21,492దరఖాస్తులు అందాయి. వీటిని పరిశీలించిన అనంతరం తుది జాబితా విడుదల చేయగా, జిల్లాలో ఓటర్ల సంఖ్య 12,19,243గా తేలింది. తద్వారా ముసాయిదాతో పోలిస్తే 2,411 మంది ఓటర్లు పెరిగారు. ఇక ఎన్ఆర్ఐ ఓటర్లు 184మంది, సర్వీస్ ఓటర్లు 681మంది ఉన్నారని వెల్లడించారు.

సెంచరీ దాటిన వారు 314మంది

జిల్లా ఓటర్ల వివరాలు వయస్సుల వారీగానూ ప్రచురించారు. ఈ జాబితాను పరిశీలిస్తే ఆసక్తికరమైన విషయాలు వెల్లడయ్యాయి. మొత్తం ఓటర్లలో వందేళ్లు దాటిన దాటిన వారు 314మంది ఉండడం ఆశ్చర్యానికి గురిచేసింది. ఇక జిల్లా ఓటర్లలో 30 నుంచి 39ఏళ్ల వయస్సు కలిగిన వారే 3,23,969 మంది ఉండగా.. యువత చేతిలోనే లోక్‌సభ అభ్యర్థుల భవిష్యత్ ఉన్నట్లు తెలుస్తోంది.

120 ప్లస్ ఓటర్లు సత్తుపల్లిలో...

వయస్సుల వారీగా ఓటర్ల వివరాలను పరిశీలిస్తే 120ఏళ్లు దాటిన వారు సత్తుపల్లి నియోజకవర్గంలోనే 110మంది ఉండడం విశేషం. మొత్తం జాబితాలో 18నుంచి 19 ఏళ్ల వయస్సు వారు 37,818మంది ఉండగా... 20నుంచి 29 ఏళ్ల వారు 2,46,892మంది, 30–39 ఏళ్ల మధ్య ఓటర్లు 3,23,969మంది, 40–49 ఏళ్ల నడుమ 2,41,628మంది, 50–59 ఏళ్ల మధ్య 1,88,085మంది, 60–69 ఏళ్ల నడుమ ఓటర్లు 1,10,205 మంది, 70–79 ఏళ్ల వారు 53,258మంది, 80–89 ఏళ్ల వయస్సు కలిగిన వారు 14,592మంది ఉన్నారు. ఇక 90–99 ఏళ్ల వయస్సు కలిగిన ఓటర్లు 2482మంది, 100నుంచి 109 ఏళ్ల వారు 123మంది, 110–119 ఏళ్ల వయస్సు వారు ఒకరు ఉన్నారు. అలాగే, 120ఏళ్ల వయస్సు పైబడిన ఓటర్లు 190మంది ఉండగా.. వీరిలో సత్తుపల్లి నియోజకవర్గంలోనే 110మంది ఉన్నారు. అలాగే, ఖమ్మం నియోజకవర్గంలో 60మంది, పాలేరు నియోజకవర్గంలో 9మంది, మధిర నియోజకవర్గం ఆరుగురు, వైరా నియోజకవర్గంలో ఐదుగురు ఉన్నట్లు తుది జాబితా ద్వారా వెల్లడైంది.

తగ్గుతున్న పురుష ఓటర్లు!

గత నెల విడుదల చేసిన ముసాయిదా జాబితా ప్రకారం జిల్లాలో 12,16,832మంది మొత్తం ఓటర్లకు గాను పురుషులు 5,88,739మంది, మహిళలు 6,28,010మంది ఉన్నారు. ఇక తుది జాబితాలో ఓటర్ల సంఖ్య 2,411 పెరిగినా.. పురుషుల సంఖ్య 496 తగ్గి 5,88,243మందికి చేరింది. మరోపక్క మహిళా ఓటర్లు 2,903మంది పెరగడంతో మొత్తం 6,30,913మందికి చేరారు. అలాగే, ఇతరులు గతంలో 78మంది ఉండగా ఈసారి 87మందిగా నమోదైంది.

క్లుప్తంగా

యూనివర్సిటీ ఉషూ పోటీలకు అన్నాచెల్లెలు


క్రీడాకారులతో డీవైఎస్‌ఓ, కోచ్

ఖమ్మం స్పోర్ట్స్: ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ ఉషూ టోర్నీ ఈనెల 13నుంచి 17వ తేదీ వరకు జరగనుంది. ఈ పోటీలకు ఖమ్మంకు చెందిన అన్నాచెల్లెలు పి.సత్యజిత్, పి.పవిత్రాచారి ఎంపికయ్యారు. ఇందులో సత్యజిత్ లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీ తరఫున, పవిత్ర హైదరాబాద్ జేఎన్‌టీయూ తరఫున ప్రతిపాధ్యం వహించనున్నారు. ఈ సందర్భంగా వీరిని డీవైఎస్‌ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి, కోచ్ పి.పరిపూర్ణాచారి గురువారం అభినందించారు.

అమ్మగూడెం భూముల్లో మట్టి దందా


వివరాలు వెల్లడిస్తున్న ఇన్‌స్పెక్టర్ సమత, ఈఓ నారాయణచార్యులు

నేలకొండపల్లి: నిషా నిద్రపోతుంటే... అక్రమార్కులు తమ పని కానిచ్చేస్తున్నారన డానికి నేలకొండపల్లి మండలంలోని అమ్మగూడెంలో చోటుచేసుకున్న ఘటనే నిదర్శనంగా నిలుస్తోంది. అమ్మగూడెంలో శ్రీరాజరాజేశ్వరి, శ్రీవేణుగోపాలస్వామి దేవాలయాలకు చెందిన దాదాపు 42.17 ఎకరాల భూమిఉంది. ఆ భూముల్లో మట్టిపై మాఫియా కన్నుపడడంతో ఎలాంటి అనుమతులు లేకుండా జేసీబీలతో గోతులు తీస్తూ దాదాపు 70 టిప్పర్ల మేర మట్టి తరలించారు. ఈ విషయమై గ్రామస్తులు దేవాదాయశాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో బుధవారం రాత్రి ఆలయ ఈఓ పి.నారాయణచార్యులు చేరుకుని హెచ్చరించడంతో మట్టి తరలింపు ఆపేశారు. అయితే, ఈఓ వెళ్లిపోయాక అర్ధరాత్రి మళ్లీ మట్టి తరలించడం ప్రారంభించారు. చివరకు గ్రామస్తులే అడ్డుకోగా, పోలీసులు చేరుకుని టిప్పర్లు, జేసీబీని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ సమత, ఈఓ పి.నారాయణచార్యులు గురువారం ఇచ్చిన ఫిర్యాదుతో కేసు న మోదు చేసినట్లు నేలకొండపల్లి ఎస్సై బి.సతీష్ తెలిపారు.

మాఫియా కనుసన్నల్లోనే..

- తనిఖీలకు భయపడని 'మట్టి' అక్రమార్కులు
- అధికారులకు తలనొప్పిగా వ్యవహారం

సత్తుపల్లి: అక్రమంగా మట్టి తవ్వకాలు సత్తుపల్లి డివిజన్‌లో యథేచ్ఛగా సాగుతున్నాయి. ఈ ముఠాకు కొందరి అండదండలు ఉండడంతో విచ్చలవిడిగా తవ్వకాలు జరుపుతున్నారని తెలుస్తోంది. మొత్తం వ్యవహారం మాఫియా కనుసన్నల్లోనే జరుగుతుండగా... ఎవరైనా ధిక్కరిస్తే అధికారులతో తనిఖీలు చేయించి వాహనాలను పట్టించడం నిత్యకృత్యమైంది. అక్రమార్కుల వ్యవహారంతో ప్రభుత్వ, ప్రైవేట్ స్థలాల్లో గుంతలు తేలుతున్నాయి. పెద్దసంఖ్యలో మట్టి తరలించే వాహనాలతో రహదారులపై ఇతర నడపలేని పరిస్థితి నెలకొందంటే ఏ స్థాయిలో దందా సాగుతుందో అర్థం చేసుకోవచ్చు. ఈ దందా విలువ రూ.లక్షల్లో ఉండగా.. అధికారులు అప్పుడప్పుడు నామమాత్రపు కేసులతో చేతులు దులుపుకుంటున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. అయితే, సామాన్యులు ఇంటి నిర్మాణం కోసం మట్టి, ఇసుక తీసుకెళ్లడం, అభివృద్ధి పనులకు ఆటంకం ఏర్పడకుండా కొన్నిసార్లు చూసీచూడనట్లు వ్యవహరించాల్సి వస్తే.. అది తమకు చుట్టుకుంటోందని అధికారులు చెబుతుండడం గమనార్హం.

మట్టి యుద్ధాలు

మట్టి తోలకాలకు ఇద్దరు, ముగ్గురు కలిసి సిండికేట్‌గా ఏర్పడినట్లు తెలుస్తోంది. వీరు అధికార పార్టీ నాయకుల అండ కోసం మితిమీరిన ఉత్సాహంతో నేతలకు మద్దతుగా సోషల్ మీడియా కేంద్రంగా


పోలీసులు స్వాధీనం చేసుకున్న మట్టి టిప్పర్లు (ఫైల్)

ప్రచారం చేస్తున్నారు. కాగా, సిండికేట్ బాధ్యులు ఏ పార్టీ అధికారంలోకి వస్తే ఆ పార్టీ నేతలను ప్రసన్నం చేసుకోవడం... ఆపై యథావిధిగా అక్రమంగా మట్టి తరలించడం ఆనవాయితీగా మారిందని సమాచారం. కాగా, మాఫియాను నియంత్రించేందుకు తీసుకున్న కొన్ని చర్యలతో చీలిక ఏర్పడగా.. పరస్పరం ఫిర్యాదులు చేసుకుని అధికారులకు పట్టిస్తుండడంతో ఘర్షణలు జరుగుతున్నాయి. ఒకరిద్దరు అక్రమార్కులకు రాజకీయ అండ దొరకడంతో వారి ఆగడాలకు అంతేలేకుండా పోయింది. సత్తుపల్లి శివారులో సింగరేణికి కేటాయించిన భూముల్లో మట్టి కోసం చేపట్టిన తవ్వకాలతో గుంతలు ఏర్పడగా.. కొందరు బండరాళ్లను తొలగించేటప్పుడు బాంబులు పెడుతున్నారని చేస్తున్న ప్రచారంతో స్థానికులు ఆందోళనకు గురవుతున్నారు.

పట్టుబడినా ఆగడం లేదు..

రాజకీయ అండ ఉన్న ఒకరిద్దరు మట్టి తోలకాలు చేస్తున్నారంటూ ఇంకొందరుఅధికారులకు సమాచారం ఇచ్చి టిప్పర్లను పట్టిస్తున్నారు. రెండు నెలల వ్యవధిలో మూడు కేసులు నమోదయ్యాయి. జరిమానా చెల్లించిన మరుక్షణం నుంచే దందాను యథావిధిగా సాగిస్తుండడంతో అధికారులకు ఏం చేయాలో తెలియని పరిస్థితి ఎదురవుతోంది. కాగా, మట్టి దందా కాసులు కురిపిస్తుండటంతో కొందరు రాజకీయ నేతల అండ కోరుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యాన గతంలో దందా చేసిన వారు సైతం రంగంలోకి దిగి పరస్పరం ఫిర్యాదులు చేసుకుంటుండడం హాట్ టాపిక్‌గా మారింది.

అధికారులపై ఒత్తిడి..

రెవెన్యూ అధికారులు, పోలీసులకు మట్టి దందా వ్యవహారం తలనొప్పిగా మారింది. ఫిర్యాదు అందినప్పుడు కేసు నమోదుచేయడం... రాజకీయ ఒత్తిడితో వదిలిపెట్టాల్సి రావడం పరిపాటిగా మారిందని తెలుస్తోంది. మట్టి తవ్వకాలకు మైనింగ్ శాఖ అనుమతి అవసరముండగా.. ఒకరిద్దరి రైతుల పొలం చదును పేరిట అనుమతి భారీగా మట్టి తరలిస్తున్నారని సమాచారం. ఈ అంశంపై రాత్రింబవళ్లు పోలీసు, రెవెన్యూ ఉద్యోగులకు ఫిర్యాదులు అందుతుండడంతో ఉరుకులు పరుగులు పెట్టాల్సి వస్తోంది. రెండురోజుల క్రితం అర్ధరాత్రి మట్టి తోలకాలపై సమాచారం రావటంతో టిప్పర్‌ను పోలీసులు పట్టుకొని రెవెన్యూశాఖకు అప్పగించారు. అయితే రెవెన్యూశాఖ ఉద్యోగులు మాత్రం తమకేమీ అప్పగించలేదని చెప్పడం కొసమెరుపు.

తనిఖీలు త్వరగా పూర్తి చేయండి


సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్, పక్కన కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి

'అభయహస్తం' సమీక్షలో కలెక్టర్ గౌతమ్

ఖమ్మం సహకారనగర్: అభయహస్తంలో భాగంగా రూ.500కు గ్యాస్ సిలిండర్ పథకానికి గాను లబ్ధిదారుల క్షేత్రస్థాయి తనిఖీలు త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ సూచించారు. కలెక్టరేట్‌లో గురువారం ఆయన కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభితో కలిసి అధికారులతో సమీక్షించారు. మహాలక్ష్మి పథకం కోసం జిల్లాలో 3,20,605 దరఖాస్తులు అందగా.. 1,70,655 రేషన్ కార్డులు అనుసంధానం పూర్తయిందన్నారు. మిగతా దరఖాస్తులను కూడా క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి గ్యాస్ ఏజెన్సీ పేరు, వినియోగదారుడి నంబరు లేనిచోట పొందుపర్చాలని తెలిపారు. ఈ సమీక్షలో జెడ్పీ సీఈఓ అప్పారావు, డీపీఓ హరికిషన్, డీఎస్‌ఓ చందన్‌కుమార్, ఆర్డీఓ జి.గణేష్, ఎస్డీసీ ఎం.రాజేశ్వరి, డీసీఓ శ్రీలత, డీడబ్ల్యూఓ సుమ పాల్గొన్నారు.

- ఖమ్మంలోని జాఫర్ బావి పునరుద్ధరణ, సుందరీకరణ పనుల్లో వేగం పెంచాలని కలెక్టర్ గౌతమ్ సూచించారు.రెయిన్ వాటర్ ప్రాజెక్ట్ బాధ్యులు కేఎంసీ కమిషనర్ ఆదర్శ్‌సురభితో కలిసి కలెక్టర్‌తో భేటీ కాగా ఆయన సూచనలు చేశారు. కేఎంసీ డీఈ నవ్యజ్యోతి, ఆర్కిటెక్చర్లు వాత్సల్య, ప్రజ్వల్, రాజశ్రీ, గీత పాల్గొన్నారు.
- ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం వెంకటేశ్వరనగర్‌లోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ గౌతమ్, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలో అందిస్తున్న సేవలు, రోజువారీ ఓపీ, మందుల పంపిణీ వివరాలు ఆరా తీసిన కలెక్టర్.. కుక్క, పాము కాటు మందులు అందుబాటులో ఉంచాలని తెలిపారు. ఆతర్వాత పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు కోసం జూబ్లీపురలోని జిల్లా పౌరసంబంధాల అధికారి పాత కార్యాలయాన్ని పరిశీలించారు. కార్యాలయం పైఅంతస్తులో కొనసాగుతున్న లైబ్రరీకి వెళ్లి నిరుద్యోగ అభ్యర్థులతో మాట్లాడారు. అలాగే, కార్యాలయం ఆవరణలోని యువజన సంక్షేమ అధికారి కార్యాలయ పాత భవనాన్ని సైతం పరిశీలించారు. ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓ రాములునాయక్, డీపీఆర్వో ఎం.ఏ.గౌస్, ఈఈలు రంజిత్, కృష్ణలాల్, ఏపీఆర్వో వి.శ్రీనివాసరావు, ఎన్డీపీఓ నిలోహన పాల్గొన్నారు.
- చింతకాని/రఘునాథపాలెం: మహాలక్ష్మి పథకానికి సంబంధించి అందిన దరఖాస్తుల సర్వేను పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ ఆదేశించారు. చింతకాని మండలం వందనం, రఘునాథపాలెం మండలం వీ.వీ.పాలెంలో సర్వేను పరిశీలించిన ఆయన మాట్లాడుతూ రూ.500కే గ్యాస్ సిలిండర్ కోసం దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి గ్యాస్ ఏజెన్సీ పేరు, వినియోగదారుడి నంబర్ సేకరించాలని తెలిపారు. కాగా, కుటుంబం యూనిట్‌గానే దరఖాస్తుల పరిశీలన చేయాలని చెప్పారు. ఎంపీడీఓలు ఎంపీడీఓ శ్రీనివాసరావు, రామకృష్ణ గ్రామ కార్యదర్శి శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హైవే కోసమే మట్టి తవ్వకాలు

- బీఆర్‌ఎస్ నేతలపై కేసులు సరికాదు
- పార్టీ జిల్లా అధ్యక్షుడు మధుసూదన్

ఖమ్మంమయూరిసెంటర్: కూసుమంచి మండలం జీళ్లచెరువు ఆలయం గుట్ట మట్టిని అధికారికంగానే జాతీయ రహదారి నిర్మాణం కోసం తవ్వారే తప్ప ఎవరూ సొంతానికి వినియోగించుకోలేదని ఎమ్మెల్సీ, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తాత మధుసూదన్ తెలిపారు. ఖమ్మంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ మట్టి వ్యవహారంలో ఇంటూరి శేఖర్, మరో ముగ్గురిని గురువారం తెల్లవారుజామున అదుపులోకి తీసుకున్న పోలీసులు... ఉదయం వరకు కూడా ఏ కేసులు పెట్టారో వెల్లడించలేదని అన్నారు. గత పదేళ్లు ఏం జరిగింది, ఈ రెండు నెలల్లో ఏం జరుగుతుందో ప్రజలు గమనించాలని కోరారు. బీఆర్‌ఎస్ నాయకులను ఇబ్బంది పెట్టాలని అధికార పార్టీ నాయకులు ప్రయత్నిస్తున్నారని


సమావేశంలో మాట్లాడుతున్న తాత మధు, పక్కన మాజీ ఎమ్మెల్యేలు సండ్ర, కందాళ తదితరులు

తెలిపారు. కాగా, 59 జీఓ కింద ఎవరెవరో లబ్ధి పొందారో తేల్చేందుకు అఖిలపక్షంతో నిజనిర్ధారణ కమిటీ వేయాలని డిమాండ్ చేశారు. ఇక తనకు, ఇంటూరి శేఖర్‌కు వ్యాపార సంబంధాలు ఉన్నాయని చెబుతున్న వారు ఆ విషయాన్ని నిరూపిస్తే ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేస్తానని తెలిపారు. మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, కందాల ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ వ్యక్తులను లక్ష్యంగా చేసుకుని వేధించడం సరికాదన్నారు. డీసీసీబీ డైరెక్టర్ శేఖర్‌పై కేసులు పెట్టిన వారు నేషనల్ హైవే అధికారులపై ఎందుకు పెట్టలేదని ప్రశ్నించారు. రహదారి నిర్మాణానికి మట్టి కోసం ఇబ్బందులు ఎదురైతే రైతులను ఒప్పించి హైవే పనులు ఆగకుండా చేశామని తెలిపారు. ఈ సమావేశంలో డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, నాయకులు ఉప్పల వెంకటరమణ, బెల్లం వేణు, ఉన్నం బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్ వద్ద ఉద్రిక్తత

నేలకొండపల్లి: డీసీసీబీ డైరెక్టర్ ఇంటూరి శేఖర్‌ను గురువారం తెల్లవారుజామున అదుపులోకి తీసుకున్న పోలీసులు నేలకొండపల్లి పోలీసుస్టేషన్‌కు తీసుకొచ్చారు. దీంతో అక్కడకు బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు తదితరులు చేరుకున్నారు. ఈసందర్భంగా శేఖర్‌తో పాటు మరో ముగ్గురిని అక్రమంగా అరెస్ట్ చేశారని ఆరోపిస్తూ పోలీసులకు వాగ్వాదానికి దిగారు. ముందుగా నోటీసులు ఇవ్వకుండా ఎలా అరెస్ట్ చేస్తారంటూ ప్రశ్నించారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా పనిచేసిన వారిపై కేసులు పెడుతున్నారని ఆరోపించారు. పోలీసులు అధికార పార్టీ నేతల అడుగులకు మడుగులు ఒత్తుతున్నారని.. ఇదిలాగే కొనసాగితే ఇబ్బంది పడతారని హెచ్చరించారు.

సామాన్యుల సమస్యలే అజెండా కావాలి

మాజీ ఎమ్మెల్సీ, ప్రొఫెసర్ నాగేశ్వర్


సెమినార్‌లో మాట్లాడుతున్న ప్రొఫెసర్ నాగేశ్వర్

ఖమ్మంమయూరిసెంటర్: సామాన్యుల సమస్యలే ప్రభుత్వాల అజెండా కావాలని అప్పుడే దేశం సుభిక్షంగా ఉంటుందని మాజీ ఎమ్మెల్సీ, ప్రొఫెసర్ నాగేశ్వర్ అన్నారు. ఖమ్మంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో గురువారం అఖిలపక్ష కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల సంయుక్త ఆధ్వర్యాన నిర్వహించిన 'పారిశ్రామిక సమ్మె విజయవంతం - అవశ్యకత' అంశంపై నిర్వహించిన సెమినార్‌లో ఆయన ప్రధాన వక్తగా మాట్లాడారు. దేశ ఆర్థిక వ్యవస్థ శరవేగంగా పెరుగుతోందని పాలకులు చెబుతున్నా.. ప్రజల కొనుగోలు శక్తి తగ్గుందనే విషయాన్ని గుర్తించాలన్నారు. ఎన్నికల నేపథ్యాన నిరుద్యోగం, ఉపాధి, సామాన్యుల సమస్యలు అజెండాగా ఉండాల్సి ఉన్నా వాటి ప్రస్తావనే ఉండడం లేదని పేర్కొన్నారు. ఇక అయోధ్య రాముడు, పాకిస్తాన్, చైనా తదితర అంశాల ఆధారంగా భావోద్వేగాలను రెచ్చగొడుతూ విపక్షపార్టీలను పాలకులు బలహీనపరుస్తున్నారని తెలిపారు. కాగా, రైతులు, పేదలు, కార్మికులు సంఘటితమై సమస్యలను తెరపైకి తీసుకొచ్చేందుకే ఈనెల 16న సార్వత్రిక సమ్మె నిర్వహిస్తున్నారని నాగేశ్వర్ వెల్లడించారు. ఈ సెమినార్‌లో సీపీఐ, సీపీఎం, న్యూడెమోక్రసీ, రైతు సంఘాల నాయకులు భాగం హేమంతరావు, పోటు ప్రసాద్, ఎర్రా శ్రీకాంత్, సాయిబాబు, రాయల చంద్రశేఖర్, గోకినపల్లి వెంకటేశ్వరరావు, దొండపాటి రమేష్, కొండపర్తి గోవిందరావు, రాంబాబు, రమేష్, తిమ్మిడి హన్మంతరావు, జలీల్, సింగు నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

డీసీఎంఎస్ చైర్మన్ కేసుపై కొనసాగిన వాదనలు

ఖమ్మంవ్యవసాయం: డీసీఎంఎస్ చైర్మన్ రాయల వెంకట శేషగిరిరావుపై అనర్హత వేటు వ్యవహారంపై వరంగల్‌లోని ట్రిబ్యునల్‌లో గురువారం వాదనలు జరిగాయి. ఇరువర్గాల వాదనలు విన్న న్యాయమూర్తి ఒకటి, రెండు రోజుల్లో తీర్పు వెలవరించనున్నారని తెలిసింది. డీసీఎంఎస్ చైర్మన్ శేషగిరిరావు డీసీసీబీ నుంచి కారు రుణం తీసుకొని బకాయి పడడంతో కారు సీజ్ చేశాక ఆయనపై అనర్హత వేటువేశారు. దీంతో శేషగిరిరావు ట్రిబ్యునల్‌ను ఆశ్రయించగా అనర్హత వేటు ఎత్తేయాలని ఆదేశించారు. అనంతరం అభ్యంతరాలు ఉంటే వెల్లడించాలని సూచించగా జిల్లా సహకార శాఖ అధికారి కౌంటర్ దాఖలు చేశారు. ఈ అంశంపై గురువారం వాదనలు కొనసాగగా, ఒకటి, రెండు రోజుల్లో తీర్పు వెలువడే అవకాశముందని తెలిసింది.

టీపీటీఎఫ్ ఆధ్వర్యాన మోటార్ సైకిల్ ర్యాలీ


ర్యాలీని ప్రారంభిస్తున్న టీపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి

ఖమ్మం సహకారనగర్: జిల్లా కేంద్రంలో ఈనెల 11, 12వ తేదీల్లో జరగనున్న టీపీటీఎఫ్ రాష్ట్ర ద్వితీయ మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ గురువారం మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఖమ్మంలోని నయబజార్ పాఠశాల నుంచి పాత బస్టాండ్, జెడ్పీ సెంటర్, రోటరీనగర్, మమత రోడ్, సంభానినగర్, చర్చి కాంపౌండ్, గాంధీచౌక్ ప్రాంతాల మీదుగా సాగిన ఈ ర్యాలీని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.నాగిరెడ్డి, ఆహ్వాన సంఘం ఉపాధ్యక్షుడు మనోహర్‌రాజు ప్రారంభించారు. ఈకార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నాగేశ్వరరావు, ఎస్.విజయ్, నాయకులు రామారావు, పద్మ, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

తాత్కాలిక ఉద్యోగి కొనసాగింపుపై విచారణ

ఖమ్మంవ్యవసాయం: విద్యుత్ శాఖలో ఓ తాత్కాలిక ఉద్యోగి కొనసాగింపు వ్యవహారంపై ఎన్పీడీసీఎల్ ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. విద్యుత్ సబ్ స్టేషన్లు, కార్యాలయాల నిర్మాణం కోసం భూదానం చేసిన కుటుంబీకుల్లో కొందరికి తాత్కాలికంగా ఉద్యోగాలు కల్పించారు. ఇందులో భాగంగానే కామేపల్లిలో భూదానం చేసిన ఓ కుటుంబంలోని సభ్యుడికి ఖమ్మంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా అవకాశం దక్కింది. ఆతర్వాత కొన్నాళ్లకు తాత్కాలిక ఉద్యోగులను తొలగించాలని ఎన్పీడీసీఎల్ నిర్ణయించినా సదరు ఆపరేటర్‌ను కొనసాగించారు. ఈ వ్యవహారంపై ఏడాది క్రితం ఎన్పీడీసీఎల్ సీఎండీకి ఫిర్యాదు అందగా.. వరంగల్ ఎన్పీడీసీఎల్ సీజీఎం(ఫైనాన్స్) రవీంద్రనాథ్ ఖమ్మంలో గురువారం విచారణ చేపట్టారు. కాగా, ఈ వ్యవహారంలో బాధ్యులైన అధికారులు ప్రస్తుతం ఖమ్మంతో పాటు ఇతర జిల్లాల్లో పనిచేస్తున్నారని తెలిసింది. అయితే, సీఎండీకి ఫిర్యాదు అందగానే సదరు ఉద్యోగిని తొలగించగా.. తనను ఆర్టిజన్‌గా విధుల్లో చేర్చుకోవాలని దరఖాస్తు చేసుకున్నట్లు సమాచారం.

లారీ నుంచి 250 లీటర్ల డీజిల్ చోరీ

నేలకొండపల్లి: మండల కేంద్రంలో రహదారి పక్కన నిలిపిన లారీ నుంచి డీజిల్ చోరీ చేసిన ఘటన ఇది. లారీ డ్రైవర్ గడ్డం సైదులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కర్ణాటక రాష్ట్రం బళ్లారి జిల్లాలోని జిందల్ ఫ్యాక్టరీకి వెళ్లేందుకు నేలకొండపల్లికి చెందిన డ్రైవర్ సైదులు బుధవారం రాత్రి బయలుదేరాడు. ఈక్రమంలో నేలకొండపల్లి - కూసుమంచి ప్రధాన రహదారి వెంట లారీ నిలిపి ఇంటికి వెళ్లాడు. గురువారం తెల్లవారుజామున వచ్చేసరికి ఆయిల్ ట్యాంక్‌ను ధ్వంసం చేసి దాదాపు 250 లీటర్ల డీజిల్ చోరీ చేసినట్లు గుర్తించిన ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

గోల్డ్ స్కీం పేరిట మోసగించారని ట్యాంక్ ఎక్కి నిరసన

నేలకొండపల్లి: గోల్డ్ స్కీం పేరిట డబ్బులు వసూలు చేసి ఆపై మోసం చేశారంటూ పలువురు వాటర్ ట్యాంక్ ఎక్కి నిరసన తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. నేలకొండపల్లి మండలం గువ్వలగూడెంకు చెందిన పలువురు నెలనెలా డబ్బు చెల్లిస్తే ఏడాదికాగానే బంగారం తో పాటు కట్టిన డబ్బు కూడా ఇస్తామని చెప్పడంతో పలువురు డబ్బు కట్టారు. గ్రామానికి చెందిన పార్వతి రూ.60 వేలు, చంద్రకళ రూ.1.20 లక్షలు, ఉపేందర్ రూ.50 వేలతో పాటు మరో పది మంది రూ.5లక్షల వరకు చెల్లించారు. కానీ గడువు తీరాక కూడా బంగారం ఇవ్వకపోగా.. పలుమార్లు అడిగినా బాధ్యుడైన స్పందించలేదని బాధితులు ఆరోపించారు. దీంతో గురువారం చంద్రకళ, పార్వతి, ఉపేందర్ గురువారం గ్రామంలోని వాటర్ ట్యాంక్ ఎక్కి న్యాయం జరిగే వరకు దిగేది లేదని భీష్మించుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు చేరుకుని ఫిర్యాదు చేస్తే దర్యాప్తు చేపట్టి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో వారు ట్యాంక్ దిగొచ్చారు. అనంతరం పోలీసులు వారి వద్ద నుంచి వివరాలు సేకరించారు.

మెడికల్ షాపు యజమానికి జరిమానా

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం టీఎన్జీవోస్ కాలనీ డంపింగ్‌యార్డు సమీపాన నివాసాల వద్ద కాలం చెల్లిన మందులను డంప్ చేసిన మెడికల్ షాపు యజమానికి కేఎంసీ అధికారులు గురువారం రూ.20 వేల జరిమానా విధించారు. కాలం చెల్లిన మందులు డంప్ చేశారనే ఫిర్యాదుతో పరిశీలించిన అధికారులు.. బిల్లుల ఆధారంగా షాపును గుర్తించి జరిమానా విధించినట్లు తెలిపారు. బయో వ్యర్థాలు, మెడికల్ వ్యర్థాలను సంబంధిత ఏజెన్సీలకు ఇవ్వాలే తప్ప ఎక్కడ పడితే డంప్ చేయొద్దని సూచించారు.

జామాయిల్ తోటలో అగ్నిప్రమాదం

కల్లూరు: కల్లూరు పరిధిలోని ఏడు ఎకరాల జామాయిల్ తోటలో గురువారం నిప్పంటుకుని మంటలు రేగాయి. ఈ ఘటనతో చెట్ల మొదలు భాగం దెబ్బతినగా స్థానికులు ఇచ్చిన సమాచారంతో సత్తుపల్లి అగ్నిమాపక శాఖ ఉద్యోగులు చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు, వెంకటేశ్వరరావు, వి.రాజేంద్ర, నరేష్, నాగరవి చేరుకుని మంటలు ఆర్పారు. దీంతో పెనుప్రమాదం తప్పినట్లయింది. అనంతరం తోట యజమానులు మద్దినేని రాధాకృష్ణ, శ్రీనివాసరావు, బోడ్డు వీరయ్య, నర్సింహ నుంచి వివరాలు సేకరించారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

చింతకాని: మండలంలోని మత్కేపల్లికి జిల్లపల్లి నాగేంద్రరావు(50) విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగేంద్రరావు తన పొలంలో మొక్కజొన్న పంటకు గురువారం నీళ్లు పెట్టే క్రమంలో వ్యవసాయ మోటార్ వద్ద ప్రమాదవశాత్తు షాక్ గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయనకు భార్య, ముగ్గురు పిల్లలు ఉండగా, కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజేందర్ తెలిపారు.

భూ వివాదాల్లో 12 మందిపై కేసు

ఖమ్మంఅర్బన్: ఖమ్మంలోని వెలుగుమట్ల రెవెన్యూ పరిధి సాగర్ ప్రధాన కాల్వ, వైరా-ఖమ్మం ప్రధాన రోడ్డు పక్కన స్థలాల విషయమై వేర్వేరుగా అందిన ఫిర్యాదుతో 12 మందిపై ఖమ్మం అర్బన్ పోలీసులు చీటింగ్ కేసులు నమోదు చేశారు. రిటైర్డ్ ఉద్యోగి కల్యాణపు కృష్ణయ్య ఇచ్చిన ఫిర్యాదుతో ఆర్.నర్సింహారావు, డి.వెంకటేశ్వర్లుతో పాటు 11 మందిపై, కాటేపల్లి నవీన్‌బాబు ఇచ్చిన ఫిర్యాదుతో బాలాజీపై, చింతనిప్పు లాలయ్య ఇచ్చిన ఫిర్యాదుతో ఇంకొందరిపై కేసు నమోదైంది. ఇందులో నర్సింహారావు, బాలాజీ, వెంకటేశ్వర్లును పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. కాగా, అదుపులోకి తీసుకున్న వారిలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఉండగా ఆయన కోసం పలువురు నాయకులు వచ్చి పోలీసులతో మాట్లాడినట్లు సమాచారం. ఈ విషయమై వివరణ కోసం సీఐని ఫోన్ ద్వారా ప్రయత్నిస్తే స్పందించలేదు.


మూడు ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం

తిరుమలాయపాలెం: మండలంలోని హైదర్‌సాయిపేట ఆకేరు నుండి అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను గురువారం పోలీసులు సీజ్ చేశారు. పిండిప్రోలుకు చెందిన డ్రైవర్లు అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్నట్లు గుర్తించగా.. వాహనాలను సీజ్‌చేసి కేసు దర్యాప్తు చేపట్టారు.

దొరికారు దొంగలు

ఏ-1 చంద్రబాబు, ఏ-2 నారాయణ, ఏ-3 లింగమనేని, ఏ-14 లోకేశ్

- ఐఆర్ఆర్ కుంభకోణం కేసులో సీఐడీ దూకుడు
- ఏసీబీ న్యాయ స్థానంలో చార్జిషీట్ దాఖలు
- కన్సల్టెన్సీ ముసుగులో భూ దోపిడీ
- తద్వారా పచ్చ ముఠా భూముల విలువ అమాంతం పెంపు
- రూ.2 వేల కోట్లకుపైగా దోపిడీ



సాక్షి, అమరావతి: టీడీపీ ప్రభుత్వ హయాంలో చంద్రబాబు యథేచ్ఛగా సాగించిన కుంభకోణాలపై సీఐడీ దూకుడు పెంచింది. ఇన్నర్ రింగ్ రోడ్ కేసులో విజయవాడ ఏసీబీ న్యాయస్థానంలో గురువారం చార్జిషీట్ దాఖలు చేసింది. ఈ కేసులో ఏ-1గా చంద్రబాబు, ఏ-2గా పొంగూరి నారాయణలను పేర్కొంది. లింగమనేని కుటుంబంతో కలిసి సాగించిన ఈ క్విడ్ ప్రో కో కుంభకోణంలో హెరిటేజ్ ఫుడ్స్ డైరెక్టర్‌గా వ్యవహరించిన నారా లోకేశ్‌ను ఏ-14గా, లింగమనేని రమేశ్ తదితరులను కూడా నిందితులుగా పేర్కొంది. వారిపై ఐపీసీ 120(బి), 409, 420, 34, 35, 37.. అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ 13(2), రెడ్‌విత్ 13(1)(సి),(డి)ల ప్రకారం వారిపై కేసు నమోదు చేసినట్టు ఆ చార్జిషీట్‌లో వెల్లడించింది. తద్వారా ఈ భారీ భూ కుంభకోణంపై న్యాయ విచారణ ప్రక్రియకు రంగం సిద్ధమైంది. కాగితాల మీదే ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌లో ఇష్టానుసారం మార్పులు చేసి, వేల కోట్ల రూపాయలు కొల్లగొట్టిన చంద్రబాబు ముఠా అవినీతి బాగోతం విభ్రాంతి పరుస్తోంది. టీడీపీ ప్రభుత్వంలో సీఆర్‌డీఏ చైర్మన్‌గా అప్పటి సీఎం చంద్రబాబు, వైస్ చైర్మన్‌గా అప్పటి మంత్రి పొంగూరు నారాయణ బరితెగించి ఇలా అవినీతికి పాల్పడ్డారు. ఇందుకోసం లింగమనేని రమేశ్‌తో క్విడ్ ప్రో కో కు తెరలేపారు. ఈ తతంగంలో నారా లోకేశ్ కూడా ప్రధాన పాత్ర పోషించారు. చంద్రబాబు బినామీ, సన్నిహితుడు లింగమనేని భూముల మార్కెట్ విలువ రూ.177.50 కోట్ల నుంచి రూ.877.50 కోట్లకు.. రాజధాని నిర్మాణం అనంతరం ఏకంగా రూ.2,130 కోట్లకు చేరేలా ఇన్నర్ రింగ్ రోడ్ అలైన్‌మెంట్‌ను ఖరారు చేయడం భారీ దోపిడీకి నిదర్శనం.

సింగపూర్ కన్సల్టెన్సీ ముసుగు

సింగపూర్‌కు చెందిన సుర్బాన జ్యురాంగ్ కన్సల్టెన్సీ ముసుగులో చంద్రబాబు ముఠా ఇన్నర్ రింగ్ రోడ్ అలైన్‌మెంట్ పేరిట భూ దోపిడీకి పాల్పడింది. సీఆర్‌డీయే ఏకంగా సింగపూర్ ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్నట్టుగా టీడీపీ ప్రభుత్వం భ్రమింపజేసింది. కానీ ఆ పేరుతో సింగపూర్‌లోని ప్రైవేట్ కన్సల్టెన్సీ సుర్బాన జ్యురాంగ్ కన్సల్టెన్సీని తీసుకువచ్చి పక్కాగా అవినీతి కథ నడిపించింది. అమరావతిలో ఇన్నర్ రింగ్ రోడ్ కోసం సీఆర్‌డీయే అధికారులు 94 కిలోమీటర్ల పొడవుతో అలైన్‌మెంట్ రూపొందించారు. ఆ ప్రకారం అమరావతిలోని చంద్రబాబు, లింగమనేని, నారాయణ కుటుంబాలకు చెందిన భూములకు 3 కిలోమీటర్ల దూరం నుంచి పెద్ద మరిమి, నిడమర్రు, చిన వడ్లపూడి, పెద వడ్లపూడి మీదుగా ఇన్నర్ రింగ్ రోడ్ నిర్మించాలి. దాంతో తమ భూముల విలువ పెరగదని గ్రహించిన చంద్రబాబు, నారాయణ.. సీఆర్‌డీయే అధికారులపై మండి పడ్డారు. వారిద్దరి ఆదేశాలతో సీఆర్‌డీయే అధికారులు ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌లో మార్పులు చేశారు. అలైన్‌మెంట్‌ను 3 కిలోమీటర్లు దక్షిణానికి జరిపి.. తాడికొండ, కంతేరు, కాజాలలోని చంద్రబాబు, లింగమనేని కుటుంబాలకు చెందిన 355 ఎకరాలు, హెరిటేజ్ ఫుడ్స్‌కు చెందిన 13 ఎకరాలను ఆనుకుని నిర్మించేలా ఖరారు చేశారు. ఆ విషయాన్ని గోప్యంగా ఉంచి.. చంద్రబాబు, నారాయణ తమ కుటుంబ సంస్థలు హెరిటేజ్, రామకృష్ణ హౌసింగ్ లిమిటెడ్‌ల తోపాటు తమ బినామీ లింగమనేని రమేశ్ సంస్థల పేరిట ఇన్నర్ రింగ్ రోడ్డుకు అటూ ఇటూ భారీగా భూములు కొన్నారు. అనంతరం సింగపూర్‌కు చెందిన సుర్బాన జ్యురాంగ్ కన్సల్టెన్సీని రంగంలోకి తెచ్చారు. అప్పటికే ఖరారు చేసిన ఇన్నర్ రింగ్ రోడ్ డిజైన్‌ను అమరావతి మాస్టర్ ప్లాన్‌లో చేర్చారు. అనంతరం ఎస్టీయూపీ అనే కన్సల్టెన్సీని నియమించారు. కానీ మాస్టర్ ప్లాన్‌లో పొందు పరిచిన అలైన్‌మెంట్‌కు అనుగుణంగానే ఉండాలని షరతు విధించారు. అంటే అప్పటికే సీఆర్‌డీయే అధికారుల ద్వారా తాము ఖరారు చేసిన అలైన్‌మెంట్‌నే ఎస్టీయూపీ కన్సల్టెన్సీ ద్వారా ఆమోదించేలా చేశారు.

ఇదిగో అడ్డగోలు దోపిడీ ఇలా..

- ఐఆర్ఆర్ అలైన్‌మెంట్ కుంభకోణం ద్వారా చంద్రబాబు ముఠా లింగమనేని కుటుంబంతో క్విడ్ ప్రో కోకు పాల్పడింది. లింగమనేని కుటుంబానికి కల్పించిన ప్రయోజనానికి ప్రతిగా చంద్రబాబు తమ హెరిటేజ్ ఫుడ్స్‌కు భూములు పొందారు. ఈ ప్రక్రియలో అప్పటి హెరిటేజ్ ఫుడ్స్ డైరెక్టర్ హోదాలో లోకేశ్ కీలక భూమిక పోషించారు. ఐఆర్ఆర్ అలైన్‌మెంట్‌ను ఆనుకుని ఉన్న కంతేరు గ్రామంలో హెరిటేజ్ ఫుడ్స్‌కు 10.4 ఎకరాలు పొందారు.
- 2014 జూన్ - సెప్టెంబర్ మధ్య ఈ భూములను హెరిటేజ్ ఫుడ్స్ కొనుగోలు చేసినట్టు చూపించారు. అంతే కాకుండా లింగమనేని కుటుంబం నుంచి మరో 4.55 ఎకరాలు కొనుగోలు పేరిట హెరిటేజ్ ఫుడ్స్ దక్కించుకుంది. కానీ అప్పటికే ఈ కుంభకోణం గురించి బయటకు పొక్కడంతో ఆ సేల్ డీడ్‌ను రద్దు చేసుకున్నారు. ఐఆర్ఆర్ అలైన్‌మెంట్‌ను ఆనుకుని లింగమనేని కుటుంబానికి చెందిన 355 ఎకరాలతోపాటు హెరిటేజ్ ఫుడ్స్ భూములు ఉండటం గమనార్హం.
- క్విడ్ ప్రో కో లో భాగంగా లింగమనేని రమేశ్ కృష్ణా నది కరకట్ట మీద ఉన్న తమ బంగ్లాను చంద్రబాబుకు ఇచ్చారు. దీనిపై కేసు నమోదు కావడంతో ఈ వ్యవహారానికి మసి పూసేందుకు చేసిన యత్నాలు బెడిసికొట్టాయి. ఆ బంగ్లాను అద్దెకు ఇచ్చానని లింగమనేని రమేశ్ చెప్పారు. కానీ ఆయన అద్దె వసూలు చేసినట్టు గానీ, చంద్రబాబు చెల్లించినట్టుగానీ ఆదాయ పన్ను వివరాల్లో లేవు.
- తర్వాత ఆ ఇంటిని ప్రభుత్వానికి ఉచితంగా ఇచ్చానని చెప్పారు. మరి అప్పటి ప్రభుత్వం నుంచి చంద్రబాబు హెచ్ఆర్ఏ ఎందుకు పొందారని ప్రశ్నించేసరికి ఆయన వద్ద నుంచి జవాబే లేదు. దాంతో ఆ బంగ్లాను చంద్రబాబుకు వ్యక్తిగతంగా క్విడ్ ప్రో కో కింద ఇచ్చారన్నది స్పష్టమైంది.

ఐఆర్ఆర్ కేసులో నిందితులు

ఏ-1: చంద్రబాబు, ఏ-2: నారాయణ, ఏ-3: లింగమనేని రమేశ్
ఏ-4: లింగమనేని వెంకట సూర్య రాజశేఖర్
ఏ-5: కేపీవీ అంజని కుమార్ (రామకృష్ణ హౌసింగ్ కార్పొరేషన్)
ఏ-6: హెరిటేజ్ ఫుడ్స్, ఏ-7: ఎల్ఈపీఎల్ ప్రాజెక్ట్స్, ఏ-14: లోకేశ్

లోకేశ్ అరెస్ట్‌కు ప్రతిబంధకం కాదు

ఐఆర్ఆర్ కేసులో సీఐడీ చార్జిషీట్ దాఖలు ఇప్పటికే విచారణలో ఉన్న 'రెడ్‌బుక్' కేసును ప్రభావితం చేయదని నిపుణులు చెబుతున్నారు. ఐఆర్ఆర్ కుంభకోణం కేసు, రెడ్‌బుక్ బెదిరింపులు వేర్వేరు కేసులు. కాబట్టి ఐఆర్ఆర్ కేసులో చార్జిషీట్ దాఖలు చేసినప్పటికీ రెడ్‌బుక్ పేరిట బెదిరింపు కేసులో లోకేశ్‌ను అరెస్ట్ చేసేందుకు ఎలాంటి అడ్డంకి ఉండదని నిపుణులు స్పష్టం చేశారు.

మ్యాప్‌ను చుట్టూ తిప్పేశారు..

- లింగమనేని కుటుంబంతో క్విడ్ ప్రో కో ద్వారా పొంగూరు నారాయణ.. తమ బంధువులు, బినామీల పేరిట 58 ఎకరాలు పొందారు. చంద్రబాబు, నారాయణ కుటుంబాలు అక్రమంగా దక్కించుకున్న భూముల సమీపంలోనే ప్రభుత్వ నిధులతో సీడ్ క్యాపిటల్ ఏరియా, స్టార్టప్ ఏరియాను అభివృద్ధి చేయాలని టీడీపీ ప్రభుత్వం ప్రణాళికను ఆమోదించింది. అందుకోసం ఏకంగా ప్రభుత్వ నిధులు రూ.5,500 కోట్లు వెచ్చించాలని నిర్ణయించింది. తద్వారా తమ భూముల ధరలు అమాంతం పెరిగేలా చేసేందుకు కుట్ర పన్నింది.
- సీఆర్‌డీఏ అధికారులు మొదట రూపొందించిన అలైన్‌మెంట్ ప్రకారం గుంటూరు జిల్లాలోని నూతక్కి - కృష్ణా జిల్లా పెద్దపులిపర్రు మధ్య కృష్ణా నదిపై వంతెన నిర్మించాలి. అక్కడి నుంచి తాడిగడప - ఎనికేపాడు మీదుగా నున్న వరకు ఇన్నర్ రింగ్ రోడ్డు కొనసాగుతుంది. అలా నిర్మిస్తే ఆ ప్రాంతంలోని నారాయణ విద్యా సంస్థల భవనాలను భూ సేకరణ కింద తొలగించాల్సి వస్తుంది. దాంతో నారాయణ ఆదేశాలతో ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌ను 3 కి.మీ. తూర్పు దిశగా మార్చారు.
- ఆ ప్రకారం గుంటూరు జిల్లాలో రామచంద్రాపురం - కృష్ణా జిల్లా చోడవరం మధ్య వంతెన నిర్మించాలని నిర్ణయించారు. అక్కడి నుంచి పెనమలూరు మీదుగా నిడమానూరు నుంచి నున్న వరకు ఇన్నర్ రింగ్ రోడ్డును నిర్మిస్తారు. దాంతో నారాయణ కుటుంబానికి చెందిన 9 విద్యా సంస్థల భవనాలను ఆనుకుని ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌ను ఖరారు చేశారు.

పవన్ కళ్యాణ్‌కూ 2.40 ఎకరాల ప్యాకేజీ

జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌కు కూడా ఈ ఇన్నర్ రింగ్ రోడ్డు అవినీతి పాపంలో పిడికెడు వాటా ఇచ్చారు. ఈ రోడ్డు అలైన్‌మెంట్‌కు సమీపంలోనే ఆయనకు 2.4 ఎకరాల భూమి ఉంది. లింగమనేని కుటుంబం నుంచి ఆ భూములను ప్రభుత్వ ధర ప్రకారం ఎకరా రూ.8 లక్షలు చొప్పున కొనుగోలు చేసినట్టు చూపించారు. ల్యాండ్ పూలింగ్ నుంచి మినహాయింపు కల్పించిన భూమినే పవన్ కళ్యాణ్‌కు ఇవ్వడం గమనార్హం.



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలుపుతున్న వైవీ సుబ్బారెడ్డి, గొల్ల బాబూరావు, మేడా రఘునాథరెడ్డి

వైఎస్సార్‌సీపీ రాజ్యసభ అభ్యర్థులు ఖరారు

అభ్యర్థులుగా గొల్ల బాబూరావు, వైవీ సుబ్బారెడ్డి, మేడా రఘునాథ రెడ్డి

సాక్షి,అమరావతి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ రాజ్యసభ అభ్యర్థులను గురువారం ఖరారు చేశారు. పార్టీ అభ్యర్థులుగా గొల్ల బాబూరావు, మేడా రఘునాథరెడ్డి, వైవీ సుబ్బారెడ్డిని ఎంపిక చేశారు. ముగ్గురు అభ్యర్థులను సీఎం జగన్ అభినందించారు. గురువారం అసెంబ్లీలోని ముఖ్యమంత్రి కార్యాలయంలో ముగ్గురు అభ్యర్థులు సీఎం జగన్‌ను కలిశారు. తమకు రాజ్యసభ అభ్యర్థులుగా అవకాశం కల్పించినందుకు వారు సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

సీ-ఓటర్ నేతి బీర సర్వే

- 2019లోనూ ఇదే రీతిలో సర్వే.. తప్పిన లెక్కలు
- గత ఎన్నికల్లో చారిత్రక విజయం సాధించిన వైఎస్సార్‌సీపీ
- తాజాగా ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్‌లోనూ సీ-ఓటర్ అంచనాలు గల్లంతు
- ప్రజల నాడి పట్టలేక విశ్వసనీయత కోల్పోయిన సర్వే సంస్థ

సాక్షి, అమరావతి: ప్రజల మనోగతం పేరుతో సీ-ఓటర్ సంస్థ నిర్వహిస్తున్న సర్వేలకు ఏమాత్రం విశ్వసనీయత లేదనేందుకు ఇటీవల జరిగిన పలు రాష్ట్రాల ఎన్నికలతోపాటు 2019 ఎన్నికల్లో ఆ సంస్థ లెక్కలు తప్పడమే నిదర్శనమని రాజకీయ విశ్లేషకులు ఉదహరిస్తున్నారు. గత నవంబర్‌లో మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు జరిగిన ఎన్నికల్లో సీ ఓటర్ అంచనాలు గల్లంతయ్యాయి. టైమ్స్ నౌ లాంటి డజనుకుపైగా జాతీయ మీడియా సంస్థలు నిర్వహించిన సర్వేలు రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధించడం తథ్యమని, టీడీపీ ఉనికి కోల్పోవడం ఖాయమని ఇప్పటికే వెల్లడించాయి. ఎలాంటి విశ్వసనీయత లేని సీ-ఓటర్ మాత్రం తనకు అలవాటైన రీతిలో సర్వే చేసినట్లు పేర్కొనగా దాన్ని పట్టుకుని టీడీపీ, ఎల్లో మీడియా చంకలు గుద్దుకోవడంపై విస్మయం వ్యక్తమవుతోంది. కోతికి కొబ్బరి చిప్ప మాదిరిగా సీ-ఓటర్ సర్వే పేరుతో హడావుడికి తెర తీశారని పేర్కొంటున్నారు. 2019లో ఎన్నికల్లో టీడీపీ 14 లోక్‌సభ, 90-100 శాసనసభ స్థానాల్లో విజయం సాధిస్తుందని తన సర్వేలో వెల్లడైనట్లు సీ-ఓటర్ ప్రకటించింది. చివరకు ఫలితాలను చూస్తే 151 శాసనసభ, 22 లోక్‌సభ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ చారిత్రక విజయాన్ని నమోదు చేయగా టీడీపీ 23 శాసనసభ, 3 ఎంపీ స్థానాలకే పరిమితమైంది.

చెప్పిందంటే.. జరగదంతే!

దేశంలో ఇప్పటిదాకా జరిగిన అధిక శాతం ఎన్నికల్లో సీ-ఓటర్ నిర్వహించిన ప్రీ-పోల్, ఎగ్జిట్ పోల్ సర్వేలు లెక్కలు తప్పాయి. ఏదైనా ఓ పార్టీ అధికారంలోకి వస్తుందని సీ-ఓటర్ తేల్చిందంటే కచ్చితంగా మరో పార్టీనే అధికారంలోకి వస్తుందని పలు సందర్భాల్లో రుజువు కావటాన్ని బట్టి ఆ సంస్థ విశ్వసనీయత ఎంతన్నది వెల్లడవుతోంది.

ఇదీ.. 'సీ ఓటర్' విశ్వసనీయత!

ఏ ఎన్నిక?	సీ ఓటర్ అంచనా/ సీట్లు	ఎన్ని సీట్లు వచ్చాయి?	అంతిమ విజేత/సీట్లు
2019 ఎన్నికలు	టీడీపీ 14 ఎంపీ, 90-100 అసెంబ్లీ	3 ఎంపీ, 23 అసెంబ్లీ	వైఎస్సార్ సీపీ 22 ఎంపీ, 151 అసెంబ్లీ
మధ్యప్రదేశ్ 2023 నవంబర్	కాంగ్రెస్ 118 - 130 (ప్రీ పోల్) కాంగ్రెస్ 113 -137 (ఎగ్జిట్ పోల్)	కాంగ్రెస్ (66)	బీజేపీ (163)
ఛత్తీస్‌గఢ్ 2023 నవంబర్	కాంగ్రెస్ 45-51(ప్రీ పోల్) కాంగ్రెస్ 41-53 (ఎగ్జిట్ పోల్)	కాంగ్రెస్ (35)	బీజేపీ (54)

జిల్లా వార్తలు

వాయుసేనలో చేరితే ఉజ్వల భవిష్యత్

ఖమ్మం స్పోర్ట్స్: ఇండియన్ ఎయిర్ ఫోర్స్ (వాయుసేన)లో ఉన్న ఉద్యోగావకాశాలపై అధికారులు జిల్లావ్యాప్తంగా ప్రచారం చేస్తున్నారు. ఇందులో భాగంగా ఖమ్మంలోని పలు డిగ్రీ కళాశాలల్లో గురువారం అవగాహన సదస్సులు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఎయిర్‌ఫోర్స్ సీనియర్ అధికారి కె.రాజేష్ మాట్లాడుతూ వాయుసేనలో అనేక అవకాశాలు ఉన్నాయని... ఇందులో ఉద్యోగం సాధిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని తెలిపారు. ఈమేరకు 17నుంచి 21ఏళ్ల లోపు వయస్సు కలిగి కనీస విద్యార్హత ఇంటర్ ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఎయిర్ ఫోర్స్ అధికారి దేవత్ మిశ్రా, డీవైఎస్ఓ టీ.సునీల్‌కుమార్ రెడ్డి, కళాశాలల ప్రిన్సిపాళ్లు డాక్టర్ రమణారావు, రామారావు, రాధాకృష్ణ, వాలీబాల్ కోచ్ అక్బర్ అలీ తదితరులు పాల్గొన్నారు.

టీ-శాట్‌లో బోధించిన భద్రాచలం బాలికలు



విద్యార్థులను అభినందిస్తున్న అధికారులు

భద్రాచలంఅర్బన్: టీ-శాట్ ఆధ్వర్యాన ఇటీవల నిర్వహించిన సూపర్ స్టూడెంట్స్ ప్రోగ్రాంలో భద్రాచలం గిరిజన గురుకుల పాఠశాల, కళాశాలకు చెందిన బాలికలు పాఠాలు బోధించారు. గురుకులంలో 9వ తరగతి చదువుతున్న మౌనిక తెలుగులో శతకపద్యం, ఇంటర్ చదువుతున్న జమున ఎకనామిక్స్‌లో మనీ బ్యాంకింగ్ సిస్టం పాఠాన్ని బోధించింది. వీరిని రాష్ట్ర గిరిజన గురుకుల, సోషల్ వెల్ఫేర్ సొసైటీ సెక్రటరీ సీతాలక్ష్మి, డిప్యూటీ సెక్రటరీ శ్రీనివాసరెడ్డి అభినందించి నగదు బహుమతి అందించారు. అలాగే, గురువారం గురుకుల ప్రిన్సిపాల్ దేవదాసు, ఉపాధ్యాయులు అభినందించారు.

నాలుగు రోజుల తర్వాత మృతదేహం గుర్తింపు

ఖమ్మం క్రైం: ఖమ్మంలోని రేవతి థియేటర్ సెంటర్‌కు చెందిన మోదుగు వెంకటేష్(30) ఉరి వేసుకుని ఆత్మహత్య పాల్పడ్డాడు. ఆయన భార్య గొడవ పడి నాలుగు రోజుల క్రితం పుట్టింటికి వెళ్లగా అదేరోజు ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తోంది. ఇంట్లో నుంచి దుర్వాసన వస్తుండడంతో గురువారం స్థానికులు టూటౌన్ పోలీసులకు సమాచారం ఇవ్వగా పరిశీలించారు. అనంతరం అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు సాయంతో మృతదేహాన్ని మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

అందని పారితోషికం

- 'అభయహస్తం' కంప్యూటర్ ఆపరేటర్ల ఎదురుచూపులు
- దరఖాస్తులు ఆన్‌లైన్ చేసి ఇరవై రోజులు దాటిన వైనం
- ఇప్పటికీ పారితోషికం అందక ప్రదక్షిణలు
- ఉమ్మడి జిల్లాలో 2,857 మంది ఆపరేటర్లు



ప్రజాపాలన సభల్లో అందిన దరఖాస్తులను ఆన్‌లైన్ చేస్తున్న ఆపరేటర్లు (ఫైల్)

చుంచుపల్లి: ప్రజాపాలన సభల్లో ప్రజల నుంచి స్వీకరించిన అభయహస్తం దరఖాస్తుల కంప్యూటరీకరణలో కీలకంగా వ్యవహరించిన ఆపరేటర్లు పారితోషికం కోసం ఎదురుచూస్తున్నారు. ఒక్కో దరఖాస్తును ఆన్‌లైన్‌లో నమోదు చేసినందుకు ప్రభుత్వ శాఖల్లోని ఆపరేటర్లకు రూ.5, ప్రైవేట్ ఆపరేటర్లకైతే రూ.15 చొప్పున చెల్లిస్తామని అధికారులు తెలిపారు. కానీ, దరఖాస్తుల నమోదు ప్రక్రియ పూర్తయి ఇరవై రోజులు దాటినా ఇప్పటివరకు అధికారులు పారితోషికం ఊసెత్తడం లేదు. దీంతో కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తుండగా సరైన సమాధానం రాకపోవడంతో ఏం చేయాలో పాలుపోని స్థితి ఎదుర్కొంటున్నారు.

రాత్రింబవళ్లు..

రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమల్లో భాగంగా డిసెంబర్ 28 నుంచి జనవరి 6వ తేదీ వరకు ప్రజాపాలన గ్రామసభలు నిర్వహించి దరఖాస్తులు స్వీకరించింది. ఈ మేరకు అభయహస్తం ద్వారా పథకాల కోసం ఉమ్మడి జిల్లాలో భారీ ఎత్తున దరఖాస్తులు సమర్పించారు. అనంతరం జనవరి 7వ తేదీ నుంచి దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ చేపట్టారు. ఇందుకోసం ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లతో పాటు మరికొందరు ప్రైవేట్ ఆపరేటర్లనూ తీసుకున్నారు. ప్రభుత్వ శాఖల్లో పరిమిత సంఖ్యలోనే ఆపరేటర్లు ఉండటంతో 75 శాతం మందిని బయట నుంచి తీసుకోగా.. ఉమ్మడి జిల్లాలో అందిన 8,21,531 దరఖాస్తులను రాత్రింబవళ్లు ఆన్‌లైన్ చేయించగా జనవరి 17 వరకు ప్రక్రియ పూర్తయింది. అయితే, ఇందులో కీలకంగా వ్యవహరించిన కంప్యూటర్ ఆపరేటర్లకు చెప్పిన ప్రకారం పారితోషికాన్ని ఇరవై రోజులు దాటినా ఇవ్వలేదు. దీనికి తోడు సరైన సమాచారం లేక ఆపరేటర్లు సంబంధిత కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. కాగా, అధికారులు సైతం పారితోషికం ఎప్పుడు వస్తుందో చెప్పలేక సతమతమవుతున్నారు.

8,21,531 దరఖాస్తులు.. 2,857 మంది ఆపరేటర్లు

ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఏడు మున్సిపాలిటీలు, 1,070 గ్రామపంచాయతీలు, ఒక కార్పొరేషన్ పరిధిలో ప్రజాపాలన సభలు నిర్వహించారు. మొత్తంగా 8,21,531 దరఖాస్తులు రాగా, ఇందులో ఖమ్మం జిల్లా పరిధిలో 4,88,316, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 3,33,225 దరఖాస్తులు అందాయి. దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు ప్రత్యేక వెబ్‌సైట్ రూపొందించి కంప్యూటర్ ఆపరేటర్లకు లాగిన్ ఇచ్చారు. ఉమ్మడి జిల్లాలో 2,857 మంది కంప్యూటర్ ఆపరేటర్లను నియమించగా.. అభయహస్తం దరఖాస్తులోని దాదాపు 27 అంశాలను నమోదు చేశారు. ఒక్కో దరఖాస్తు ఆన్‌లైన్ చేయడానికి పావు గంటకు పైగానే పట్టగా ఒక్కో ఆపరేటర్ 350 నుంచి 450 దరఖాస్తులను ఆన్‌లైన్‌లో పొందుపరిచాడు. ఈ మేరకు ఒక్కొక్కరికి సగటున రూ.6 వేల నుంచి రూ.7 వేల వరకు పారితోషికం రావాల్సి ఉన్నా ఎదురుచూపులే మిగిలాయి.

అధికారులు చొరవ తీసుకోవాలి



మండల అధికారుల పిలుపు మేరకు నేను అభయ హస్తం దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియలో పనిచేశాను. ఆ సమయంలో ఒక్కొక్క దరఖాస్తుకు రూ.15 చొప్పున ఇస్తామని చెప్పారు. దాంతో పది రోజుల పాటు ప్రజాపాలన దరఖాస్తులను క్రోడీకరించడంలో సేవలు అందించాను. రావాల్సిన పారితోషికం కోసం దాదాపు నెల రోజులుగా ఎదురుచూస్తున్నాను. సంబంధిత అధికారులు చొరవ తీసుకొని ఇప్పించాలని కోరుతున్నాను.

–ధరావత్ కబీర్‌దాస్, కంప్యూటర్ ఆపరేటర్

బీటీపీఎస్ కీర్తిని మరింత పెంచాలి



ఉద్యోగులను అభినందిస్తున్న సీఈ బిచ్చన్న

మణుగూరురూరల్: ఉద్యోగులు క్రీడారంగంలోనూ నైపుణ్యం ప్రదర్శిస్తూ భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్ (బీటీపీఎస్) కీర్తిని మరింత పెంచాలని సీఈ బి.బిచ్చన్న సూచించారు. ఇటీవల పాల్వంచ కేటీపీఎస్‌లో జరిగిన టీఎస్ జెన్‌కో ఇంటర్ ప్రాజెక్ట్స్ బాస్కెట్ బాల్, హాకీ టోర్నమెంట్‌లో బీటీపీఎస్ క్రీడాకారులు ప్రతిభ కనబర్చి తృతీయస్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా క్రీడాకారులు గురువారం సీఈ బిచ్చన్నను కలవగా ఆయన అభినందించి మాట్లాడారు. జెన్‌కో నాణ్యమైన విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తూ దేశంలోనే అగ్రగామిగా నిలవగా.. సంస్థలోని క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ కార్యదర్శి కల్తీ నర్సింహారావు, జట్టు మేనేజర్ ఎస్.వెంకటేశ్వర్లుతో పాటు డి.రమేష్, ఎం.నాగేశ్వరరావు, ఆర్.మురళి, డి.సురేశ్, డి.వెంకటేశ్వర్లు, టి.గోపి, బి.ఉదయ్‌కుమార్, బి.రవితేజ, ఎండీ ఖయ్యూం, జి.నవీన్‌రెడ్డి, జి.సంపత్, ప్రవీణ్, కె.మధు, భరత్, రవి, సతీశ్‌రెడ్డి, రాము తదితరులు పాల్గొన్నారు.

నదీ జలాల పంపిణీ శాస్త్రీయంగా ఉండాలి

- మార్చి 3నుంచి 'ఆలిండియా యూనిటీ'మహాసభలు
- ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు



మాట్లాడుతున్న రంగారావు, పక్కన నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: కృష్ణా జలాల పంపిణీ విషయంలో తెలుగు ప్రజల మధ్య వైషమ్యాలు రెచ్చగొట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని.. అలా కాకుండా నదీ జలాల పంపిణీ, సరిహద్దు వివాదాల్లో శాస్త్రీయత ఉండాలని సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు అన్నారు. ఖమ్మంలోని రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో బీఆర్ఎస్ అధికారం కోల్పోయాక ప్రాంతీయ ఉన్మాదాన్ని రెచ్చగొట్టడానికి యత్నిస్తోందని విమర్శించారు. మరోపక్క కాంగ్రెస్ సైతం సావధానమైన పరిష్కారం వెతకకుండా ఎదుటివారిని నిందిస్తూ ప్రజల మధ్య చీలికలు తీసుకురావడానికి, ఇతర సమస్యల నుంచి పక్కదారి పట్టించడానికి యత్నిస్తున్న పరిస్థితి కనిపిస్తోందని తెలిపారు. ఇకనైనా సమస్యకు సామరస్య పరిష్కారంతో పాటు గోదావరి జలాలు తెలంగాణకు మళ్లించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగిన కార్యాచరణ ప్రకటించాలన్నారు. కాగా, రాష్ట్రంలో చంద్రబాబు హయాం నుంచి సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్ తదితర పార్టీల నాయకులపై పెట్టిన రౌడీ షీట్లు ఎత్తివేయాలని కోరారు. ఎన్నికలకు ముందు ఏడో గ్యారంటీగా ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరిస్తామని హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం ఈ విషయంలో చొరవ చూపాలే తప్ప ఆ పార్టీ నేతలపై రౌడీషీట్లను రద్దు చేయాలనే ప్రయత్నాలు సరికాదని రంగారావు పేర్కొన్నారు.

'మాస్‌లైన్'గా ఏర్పాటు

సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా, 14 రాష్ట్రాల్లో ఉన్న పీసీసీ సీపీఐ ఎంఎల్, సీపీఐ ఎంఎల ఆర్ఐ నడుమ ఏడాది కాలంగా చర్చలు జరుగుతుండగా.. సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ పార్టీగా ఏర్పడాలని నిర్ణయించినట్లు రంగారావు తెలిపారు. ఈ మేరకు ఆలిండియా యూనిటీ మహాసభలు మార్చి 3, 4, 5వ తేదీల్లో ఖమ్మం కేంద్రంగా జరగనున్నాయని చెప్పారు. కాగా, రచయిత ఎన్.వేణుగోపాల్, రవిశర్మ తదితరుల ఇళ్లలో ఎన్ఐఏ దాడులు నిర్వహించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు రంగారావు పేర్కొన్నారు. ప్రజాస్వామిక భావనలు ఉన్న వారిని, ప్రజా ఉద్యమానికి మద్దతుగా నిలిచిన వారిని నిర్బంధించేందుకు ఎన్ఐఏను కేంద్రం వినియోగిస్తోందని ఆరోపించారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి గోకినపల్లి వెంకటేశ్వరరావు, నాయకులు గుర్రం అచ్చయ్య, జి.రామయ్య, సీవై పుల్లయ్య, వెంకయ్య, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

బౌద్ధక్షేత్రాన్ని సందర్శించిన ప్రొఫెసర్ నాగేశ్వర్



ప్రొఫెసర్ నాగేశ్వర్‌ను సన్మానిస్తున్న స్థానికులు

నేలకొండపల్లి: మండల కేంద్రంలోని బౌద్ధక్షేత్రం, భక్త రామదాసు ధ్యాన మందిరాన్ని మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కె.నాగేశ్వర్ గురువారం సందర్శించారు. తొలుత బౌద్ధక్షేత్రానికి వచ్చిన ఆయన నిర్మాణ శైలి, ఇతర వివరాలు తెలుసుకున్నారు. అనంతరం రామదాసు మందిరాన్ని సందర్శించగా పూజారి సౌమిత్రి రమేశ్ ప్రత్యేక పూజలు చేశారు. ఆ తర్వాత కళాపీఠం బాధ్యులు ప్రొఫెసర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో సాధు రాధాకృష్ణమూర్తి, పెండ్యాల గోపాలకృష్ణమూర్తి, పసుమర్తి శ్రీనివాస్, వాసుదేవరావు, పగిడికత్తుల రామదాసు, పసుమర్తి గురునాథం, రాయపూడి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అర్చక, ఉద్యోగులకు పురస్కారాలు



పురస్కారం అందుకుంటున్న రమేశ్‌శర్మ

ఖమ్మంగాంధీచౌక్: తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న అర్చక, ఉద్యోగులకు గంగు భానుమూర్తి స్మారక పురస్కారాలను బుధవారం రాత్రి హైదరాబాద్‌లో అందజేశారు. ఈ సందర్భంగా ఖమ్మం జిల్లాకు చెందిన నలుగురు అర్చక ఉద్యోగులు, మరో నలుగురు ధూపదీప నివేదన అర్చకులు పురస్కారాలను అందుకున్నారు. కాగా, పురస్కారాలు అందుకున్న అర్చకుల్లో శేషభట్టార్ కృష్ణమాచార్యులు, కాసవజ్ఝల రామశర్మ, నవకంటి హరికృష్ణ, ఉద్యోగి తోటకూరి వెంకటేశ్వర్లుతో పాటు ధూప దీప నివేదన అర్చకులు మునగలేటి రమేశ్‌శర్మ, ఆమంచి సురేశ్‌శర్మ, మారింగంటి భార్గవాచార్యులు, అన్నవజ్ఝల ప్రసాద్‌శర్మ ఉన్నారు. ఈ సందర్భంగా వారిని రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ కమిషనర్ అనిల్‌కుమార్‌తో పాటు జిల్లాకు చెందిన అర్చకులు, ఉద్యోగులు అభినందించారు.